క్లుప్తంగా

భక్తిప్రపత్తులతో ఆండాళ్ నీరాట్టు ఉత్సవం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న గోదాదేవి

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి సన్నిధిలో ఆండాల్ నీరాట్టు ఉత్సవం గురువారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ధనుర్మాస పూజలు, తిరుప్పావై అనంతరం గోదాదేవిని తిరుచ్చిపై ఆశీనులు చేసి పుర వీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆండాళ్‌కు నీరాట్టు ఉత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్య పర్యవేక్షించారు.

ముక్కంటి సేవలో సినీనటుడు కార్తికేయ



గురుదక్షిణామూర్తి సన్నిధిలో కార్తికేయ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ప్రముఖ సినీనటుడు కార్తికేయ తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే పునర్జన్మనిచ్చినట్లే!



రక్తదానం చేస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి: తల్లిదండ్రులు జన్మనిస్తే రక్తదానం మరొకరికి పునర్జన్మనిస్తుందని విశ్రాంత ఉద్యోగి స్వర్ణమూర్తి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు సమీపంలోని నిరాశ్రయుల వసతి గృహంలో గురువారం యువతరం సేవాసమితి రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 40 మంది రక్తదానం చేశారు. స్వర్ణమూర్తి మాట్లాడుతూ, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ వైద్యులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో రక్తం రోగులకు ఎంతో అవసరమని, ఇలాంటి సమయంలో యువతరం సేవా సమితి రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో యువతరం సేవాసమితి సభ్యులు, బ్లడ్ బ్యాంకు సిబ్బంది, ఎల్‌ఐసీ ఉద్యోగులు, కజారియా ఉద్యోగులు పాల్గొన్నారు.

లింకు రోడ్డును బాగుచేశారు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం నుంచి కొత్తవీరాపురం లింకు రోడ్డు మరమ్మతులు గురువారం సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో చేశారు. 1.5 కిలోమీటర్ల వరకు పొలాల్లో లింకు రోడ్డు ఉంది. రోడ్డు గుంతలమయమై ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో వాహనాల రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. సమస్యను సర్పంచ్‌కు నివేదించడంతో జేసీబీతో రోడ్డు చదును చేసి, ముళ్ల పొదలను తొలగించారు.

విడాకులు పొందినా వేధింపులు

-మాజీ భర్తపై టీచర్ ఫిర్యాదు
-కేసు నమోదు చేసిన పోలీసులు

ఏర్పేడు: ఉపాధ్యాయురాలిని వేధిస్తున్న ఆమె మాజీ భర్తపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం రాత్రి తెలిపారు. సీఐ కథనం..రేణిగుంట మండలం బిస్మిల్లా నగర్‌కు చెందిన దుర్గా భవాని మండలంలోని గుడిమల్లం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వెంకటబ్రహ్మంతో 2008న ఆమెకు వివాహమైంది. భర్త వేధింపులను భరించలేక 2015 నవంబర్‌లో మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. అలాగే విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో 2022 సెప్టెంబర్ 20న కోర్టు విడాకులు మంజూరు చేసింది. అయితే ఈ నెల 10న మాజీ భర్త వెంకటబ్రహ్మం స్కూలుకు వెళ్లి, దుర్గాభవానిని బెదిరించి దుర్భాషలాడారు. గురువారం ఆమె ఫిర్యాదు చేయడంతో సీఐ కేసు నమోదు చేశారు.

పెండింగ్ జీతాలు చెల్లించరూ!



పిచ్చాటూరు: గ్రామ పంచాయతీలలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిన్నిరాజ్ కోరారు. గురువారం గ్రామ అంబాసిడర్లతో కలిసి స్థానిక ఏఐటీయూసీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు సౌకర్యం

- కృతజ్ఞతలు తెలిపిన కాంబాకం ప్రజలు
- సాగు భూములకు పట్టాలు ఇప్పించాలని రామిరెడ్డిపాళెం గిరిజనుల వినతి



కాంబాకంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: గత టీడీపీ ప్రభుత్వంలో అటవీశాఖ అధికారులు అభ్యంతరంతో ఆగిపోయిన రోడ్డు పనులకు మోక్షం కల్పించి రోడ్డు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి ఎప్పటికీ అండగా ఉంటామని కాంబాకం గ్రామస్తులు ప్రకటించారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. సర్పంచ్ దీప ఆధ్వర్యంలో స్థానికులు ఆయనను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డిపాళెం, కాంబాకం, గోవిందరెడ్డి దరఖాస్తు, సంతోష్‌పురం గిరిజనకాలనీలో పర్యటించారు. 457 ఇళ్లకు వెళ్లి మాట్లాడారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

తమ ఆధీనంలో ఉన్న సాగు భూములకు డీకేటీ పట్టాలు మంజూరు చేయించాలని రామిరెడ్డిపాళెం గిరిజనులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత భూములను పరిశీలించి, అర్హత కలిగితే అసైన్‌మెంట్ కమిటీకి వివరాలు అందజేసి, పట్టాల పంపిణీకి సిద్ధం చేయాలని తహసీల్దార్ గౌరిశంకరరావును ఆదేశించారు. అలాగే రామిరెడ్డిపాళెంలో తాగునీటి అవసరాలకు జెడ్పీ నిధులతో బోరు వేయాలని సూచించారు.

బాబుకు, పవన్‌కు బుద్ధి చెప్పడం తథ్యం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను స్వాగతిస్తే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గౌరవం పెరిగేదన్నారు. 11 మందిని పొట్టన పెట్టుకున్న చంద్రబాబుతో చేయి కలిపిన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్.. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, దానిని అంతమొందించాలని వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం బురద చల్లుతూ, కువిమర్శలు చేస్తున్న వీరిద్దరికీ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు చిన్నా, తిలక్‌బాబు, ఎంపీటీసీ సుబ్రమణ్యం, సీనియర్ నాయకుడు నరేంద్ర, మాజీ ఎంపీటీసీ పోలయ్య, మాజీ సర్పంచ్ బాబు, పంచాయతీ కన్వీనర్ తేజరెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మైనారిటీ సెల్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే , వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ సిరాజ్ బాషా

ముస్లిం మైనారిటీ సెల్ క్యాలెండర్ల ఆవిష్కరణ

వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ సెల్ ముద్రించిన క్యాలెండర్లను ఎమ్మెల్యే, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్ బాషా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ముస్లిం మైనారిటీలందరూ జగనన్నకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. అలాలగే వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను ఆయన సత్కరించారు. గ్రామస్థాయిలో మైనారిటీల సమస్యలు పరిష్కరించేందుకు వక్ఫ్ బోర్డు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి, డైరెక్టర్లు లతీఫ్, అబ్దుల్, ముస్లింపాళెం సర్పంచ్ అబ్దుల్ మజీద్, కో–ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, మైనారిటీ సెల్ నాయకులు ఫిరోజ్ ఖాన్, సల్లావుద్దీన్, అన్వర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో ఐసీడీఎస్ అధికారులు, విద్యార్థులు

పిచ్చాటూరు: మండలంలోని వేలూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులతో కలిసి మహిళా–శిశు సంక్షేమ శాఖ అధికారులు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సాంప్రదాయ దుస్తుల్లో ఉన్న విద్యార్థులతో కలిసి గొబ్బిపాటలు పాడారు. సంక్రాంతి ముగ్గులు వేశారు. అనంతరం భోగి మంటలు వేసి, పొంగళ్లు పెట్టి, సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మరియమ్మ, లత, బేబి, శ్రీదేవి, సుమతి, అంగన్‌వాడీ కార్యకర్తలు మునిరత్న, శ్రీదేవి, ప్రమీల, కవిత, సంగీత, హెల్పర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న గురవారెడ్డి

ఏర్పేడు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని పాతవీరాపురంలో గురువారం మన గ్రోమోర్ ఆధ్వర్యంలోముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు గ్రామాల మహిళలు ఆకట్టుకునేలా వివిధ రకాల రంగవల్లులు వేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, మన గ్రోమోర్ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ భానుప్రకాష్, మేనేజర్ అశోక్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శివ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాల స్థావరాలపై దాడులు

- గుడారాలు, కంచెలు ధ్వంసం చేసిన పోలీసులు



కోడి పందాల స్థావరాలను ధ్వంసం చేస్తున్న సీఐ సురేష్‌కుమార్, ఎస్‌ఐ సునీల్

కేవీబీపురం: మండలంలోని అంజూరు, సూరమళ, అంజూరు పాళెం తదితర గ్రామాల్లో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై గురువారం సాయంత్రం పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. పందేలరాయుళ్లు పారిపోయారు. దీంతో కోడిపందాల నిర్వహణకు ఏర్పాటు చేసిన గుడారాలు, ముళ్లకంచెలను పోలీసులు ధ్వంసం చేసి తగలబెట్టారు. సీఐ మాట్లాడుతూ, సంకాంత్రి నేపథ్యంలో కోడిపందాలు, జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా వీటిని నిర్వహిస్తున్న పక్షంలో 100 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. దాడుల్లో ఎస్‌ఐ సునీల్, స్థానిక, పుత్తూరు రూరల్ క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి భారతి కోరారు. గురువారం కంచనపుత్తూరు గ్రామ సచివాలయంలో రైతు సలహా మండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తోందని, వీటిపై అవగాహన కల్పించి, అర్హులైన రైతులకు అందేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు, వైఎస్ఆర్ రైతు భరోసా, నాణ్యమైన ఉత్పత్తుల సరఫరా, సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఈ–పంట, పంట నమోదు, మార్కెట్ ధరలు, వ్యవసాయ యాంత్రీకరణ, పశువైద్యం, ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమ, వాతావరణ సూచనలు, సలహా మండళ్లు, మట్టి పరీక్షలు..మొదలైన సేవలు రైతు భరోసా కేంద్రాల్లో పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరులేన్ల రోడ్డు పనులను అడ్డుకునేందుకు రైతుల యత్నం



పొలాల్లో ఆరులేన్ల పనులు చేస్తున్న జేసీబీలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట, ఏర్పేడు, మేర్లపాక గ్రామాల వద్ద గురువారం ఆరులేన్ల రోడ్డు పనులను రైతులు అడ్డుకునేందుకు విఫల యత్నం చేశారు. వివరాలు.. మండలంలోని సీతారాంపేట, ఏర్పేడు, మేర్లపాక మేర 1.5 కిలోమీటర్ల దూరం వరకు ఆరులేన్ల రోడ్డు పనుల కోసం 2018లో 52.5 ఎకరాల భూములను సేకరించారు. ప్రభుత్వ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు రైతులతో చర్చించి హామీ ఇచ్చారు. అలాగే ఆయా రైతులకు నోటీసుల ద్వారా తెలియజేశారు. ఆ తర్వాత 2021 సెప్టెంబర్ 1న రెండు దినపత్రికల్లో ప్రభుత్వం నష్టపరిహారం విషయమై ప్రకటన ఇవ్వడంతో 30 ఎకరాలకు చెందిన రైతులు పరిహారం పొందారు. మిగిలిన 22 ఎకరాలకు చెందిన రైతుల కోసం మళ్లీ 2021 నవంబర్ 1న ప్రకటన వేశారు. నిర్ణీత గడువులోపు నష్టపరిహారం పొందని పక్షంలో భూసేకరణ చట్టం ప్రకారం భూములను స్వాధీనం చేసుకుంటామని అందులో ప్రకటించారు. అయినా వారు నష్టపరిహారం తీసుకోకపోవడంతో చట్టబద్ధంగా పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు పనులకు పూనుకున్నట్లు తహసీల్దారు ఉదయ్ సంతోష్ చెప్పారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వరి పంటలో రోడ్డు పనులు మొదలెట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్ఫూర్తిదాయకం.. వివేకానందుడి జీవితం



శ్రీకాళహస్తి: వివేకానందుని విగ్రహం ముందు నివాళులర్పిస్తున్న నాయకులు



నారాయణవనంలో..



వరదయ్యపాళెం : గోపాలరావు కాలనీలో..



శ్రీకాళహస్తి ఎస్పీఎస్ డిగ్రీ కళాశాలలో..



బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ హైస్కూలులో..

- పలుచోట్ల ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

శ్రీకాళహస్తి రూరల్: భారతీయ ఆత్మకు ప్రతీక, నిత్య చైతన్య స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానందుడని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కీర్తించారు. స్వామి వివేకానంద 160వ జయంతిని గురువారం శ్రీకాళహస్తి మండలంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి డీఎస్పీ విశ్వనాథ్, బీజేపీ నాయకుడు చంద్రప్ప, బాలసుబ్రమణ్యం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంజూరు మాట్లాడుతూ, స్వామి వివేకానంద ప్రసంగాలు చరిత్రలో మిగిలిపోతాయన్నారు.పౌరులు విశ్వాసం, విధేయత, వినయం, వంటివి అలవరచుకుంటే రాణించగలరన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: స్వామి వివేకానంద 160వ జయంతిని నారాయణవనంలో ఘనంగా నిర్వహించారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధి వీధిలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతీయ సనాతన ధర్మ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన అదర్శప్రాయుడైన వివేకానందుడి జీవితాన్ని యువత ఆదర్శకంగా తీసుకోవాలని వీహెచ్‌పీ నాయకులు అన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

వరదయ్యపాళెం: వివేకానంద జయంతి పురస్కరించుకుని మండలంలోని గోపాలరావుకాలనీలో బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్స్ ఫౌండేషన్ నిర్వాహకులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం తహసీల్దార్ గౌరిశంకరరావు, సంస్థ అధ్యక్షులు రియాజ్ స్వామి దుప్పట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ జ్యోతి, సర్వేయర్ రమణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆదర్శనీయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: స్వామి వివేకానంద యువతకు ఆదర్శనీయుడని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పి జాగృతం చేసిన మహనీయులని యోగా గురువు సురేష్‌నాయుడు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో పదవ తరగతి పూర్వ విద్యార్థులు షణ్ముగం, శ్రీనివాసులు, సురేంద్ర, శేఖర్, ఉషారాణి, యువశ్రీమురళి, సుబ్రమణ్యం, మునికుమార్, నాగేశ్వరరావు, ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి పలువురు మాట్లాడారు.

ఎస్పీఎస్ డిగ్రీ కాలేజీలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ దీనదయాల్ మాట్లాడారు. యువశక్తిని మించిన శక్తి లేదని స్వామి వివేకానంద అన్నారని, అపజయాలను పట్టించుకోకుండా ప్రయత్నం చేసినపుడు గొప్ప విజయాలు సాధిస్తారన్నారు. అనంతరం శుకబ్రహ్మాశ్రమానికి చెందిన సర్వాత్మనందగిరిస్వామిని ఘనంగా సన్మానించారు. జొల్లికంటి సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26 పనులకు రూ.86 లక్షలు మంజూరు

- నాగలాపురం మండల సమావేశంలో ఎంపీపీ సింధు
- ఉద్యానవనం, అటవీ, వెటర్నరీ, మత్స్యశాఖల అధికారులు గైర్హాజరు



నాగలాపురంలో మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సింధు

పిచ్చాటూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన 29 పనులకు రూ.86 లక్షలు మంజూరైనట్లు ఎంపీపీ సింధు తెలిపారు. గురువారం నాగలాపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. గడప గడపకు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని, ఇందులో భాగంగా నాగలాపురం మండలానికి ఇప్పటి వరకు 4 సచివాలయాలకు సంబంధించి 29 పనులకు 86 లక్షలు మంజూరు చేశారని, ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 4 సచివాలయాల పనులు ప్రతిపాదనలు దశలో ఉన్నాయన్నారు. ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ, లబ్ధిదారులను చైతన్యపరచి ఉగాది నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, దీనికి ప్రజాప్రతినిధులు సహకారం ఇవ్వాలని కోరారు. అలాగే పంచాయతీలకు కార్యదర్శి, ఏఎస్‌ఎం జాయింట్ అకౌంట్ ద్వారా మంజూరైన నిధులను గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు క్లోరినేషన్ పనులకు వినియోగించాలన్నారు. సమావేశానికి ఉద్యావనం, అటవీ, వెటర్నరీ, మత్స్య శాఖ గైర్హాజరు అయ్యారని, గడప గడప కార్యక్రమాలకు కూడా ఈ శాఖల అధికారులు రావడం లేదని, వారికి నోటీసులు ఇవ్వాలని సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు సమావేశం దృష్టికి తెచ్చారు. అనంతరం శాఖల వారీగా పనుల పురోగతిని అధికారులు నివేదించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీలు కుమారి, జాయిస్, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదురై, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సుబ్బానాయుడుకండ్రిగలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాళహస్తి రూరల్: చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. గురువారం వేడాం, చిన్నమిట్టకండ్రిగ, పెద్దమిట్టకండ్రిగ, రామాపురం, రామలింగాపురం, బొక్కసంపాలెం, సుబ్బానాయుడుకండ్రిగ, కోదండరామాపురం, కాపుగున్నేరి, చెర్లోపల్లె గ్రామాల్లో పట్టభద్రులను కలిశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుట్టంరెడ్డి బాలిరెడ్డి, ఎంపీటీసీ గోవిందరెడ్డి, పోలంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రామిరెడ్డి, ప్రసాద్, శివ, వెంకటేష్, సిద్ధాగుంట శంకర్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, అంకయ్య, పూడి మునిరామయ్య యాదవ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సరుకుల పంపిణీ



దుస్తులు, సరకులు అందజేస్తున్న కరుణాకరన్



బీమా నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

ఏర్పేడు: సంక్రాంతి పురస్కరించుకుని మండలంలోని పాపానాయుడుపేటలో సర్పంచ్ లలిత గురువారం గ్రీన్ అంబాసిడర్లకు నిత్యావసర సరకులు, నూతన దుస్తులు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కరుణాకరన్, ఈఓపీఆర్డీ బాలసుబ్రమణ్యంరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు..

వరదయ్యపాళెం: మండలంలోని బీజీఆర్ గిరిజనకాలనీలో చిన్నబ్బ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు వైఎస్సార్ బీమా కింద ప్రాథమికంగా అంత్యక్రియలకు మంజూరు చేసిన రూ.10వేలను గురువారం జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ జ్యోతి, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి గోపికృష్ణ పాల్గొన్నారు.

దుస్తులు, విద్యాసామగ్రి..

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగ, పెనుమల్లం గ్రామాల్లో గురువారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన దుస్తులు, స్వెటర్లు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లోని 127 మంది పేద విద్యార్థులకు ఈ వితరణ చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శేఖర్, ప్రతినిధి తేజస్విని, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

సత్యవేడు: మండలంలోని చిన్నఈటిపాకంలో రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పోలయ్య కుటుంబానికి గురువారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పార్టీ నాయకులతో కలిసి రూ.10వేలతోపాటు నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. అంతకుముందు కొత్తవారికుప్పం, చిన్నఈటిపాకం గ్రామాల్లో ఎన్జీవో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎబినైజర్ సహకారంతో తవ్వించిన తాగునీటి బోర్లను, ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులను ప్రారంభించారు. జెడ్పీటీసీ విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచులు గోవిందస్వామి, శ్రీరాములురెడ్డి, రూబెన్, జయ, మండల వ్యవసాయ సలహాకమిటీ అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, యూత్‌వింగ్ అధ్యక్షుడు గోవిందస్వామి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, బాలగణేషన్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో డోలు విద్వాంసుడు రవి ఉద్యోగి 3 నెలల క్రితం మరణించాడు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం దేవదాయ శాఖ ద్వారా రూ.15 వేలు మంజూరు చేసింది. గురువారం సాయంత్రం నాగలాపురంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆ చెక్కును మృతుడి భార్య కవితకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామచంద్రా రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏవీఎం బాలాజీ రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, వైఎస్ఆర్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్‌ఎం సురేష్, తిలక్ బాబు, మగేష్, జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత సుందరరామిరెడ్డి మృతి






సుందరరామిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి తదదితరులు

నాయుడుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి తండ్రి ఓడూరు సుందరరామిరెడ్డి గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోదరుడు వైవీ హనుమారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ డి.శ్రీమంత్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎస్.సుబ్రమణ్యం, మాజీమంత్రి పరసా వెంకటరత్నం ఓడూరు నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, కుమార్, శేఖర్‌రెడ్డి, తిరుపాల్, ఎంపీపీలు కె.ధనలక్ష్మి, శేఖర్‌రెడ్డి, పాండురంగ యాదవ్, రాజసులోచనమ్మ, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి దయాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో సుందరరామిరెడ్డికి నివాళులు అర్పించారు.

ఫోన్‌లో పలువురి పరామర్శ


వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డిని రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌కే రోజా, మేరుగ నాగార్జున, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు ఫోన్‌లో పరామర్శించారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



ఎంజీఎం కళాశాల ఆవరణలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు ఉత్సాహంగా భోగిమంటలు వేశారు. ప్రిన్సిపాల్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో అలరించారు. కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి భోగిమంటలు వేశారు. వైస్ ప్రిన్సిపాల్ అనిల్, ఇన్‌చార్జి ప్రశాంతి, సత్యవతి, శివశంకర్, నవీన్, వెంకటేష్, ముబీషిర, పద్మజ, రుక్సానా, కవిత, స్వాతి, శ్రీలత, శ్రీలక్ష్మి, సారిక, శశి, డ్యాన్స్‌మాస్టర్ జానీ పాల్గొన్నారు.